విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో ప్రజా ఆదరణ పొందుతున్న ప్రజా ముద్ర న్యూస్ ఛానల్ మరియు పత్రిక నందు పనిచేయుటకు అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు మరియు మండలాలు వారీగా రిపోర్టర్స్ (విలేకర్లు) కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి
95738 00809

ప్రజా ముద్ర
తెలుగు డిజిటల్ దినపత్రిక
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం !
PRAJA MUDRA NEWS
Follow /
సంపుటి: 01 సంచిక: 323 సంపాదకులు కె. నరేష్ కుమార్ 24 శుక్రవారం జులై 2026 పేజీలు: 8 వెల: రూ. 3/-
Published from , Nizamabad, Hyderabad, Rangareddy, Warangal, Medak, Mahabub Nagar, Mahabubabad, Khammam, Karimnagar, Nalgonda, Adilabad



## హైదరాబాద్‌కు 50 ఏళ్లపాటు
# నీటి కొరత ఉండొద్దు

**సీఎం రేవంత్ రెడ్డి**
**కనీసం రోజు విడిచి రోజైనా తాగునీరందించాలి..**
**పనుల పర్యవేక్షణకు ప్రత్యేక డ్యాష్‌బోర్డు**
**3, 4 రోజులకు ఒకసారి నీళ్లిచ్చే పరిస్థితి మారాలి..**
**ఏడాదిన్నరలో సరఫరా పనులు పూర్తి చేయాలని ఆదేశం**

హైదరాబాద్, ప్రతినిధి జులై 23: హైదరాబాద్ మహానగరంలో రానున్న 50 సంవత్సరాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పక్కా ప్రణాళికలతో 'సమగ్ర మాస్టర్ ప్లాన్' రూపొందించాలి" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను స్పష్టంగా ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణపై ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి జారీ చేసిన ముఖ్య ఆదేశాలు మరియు మార్గదర్శకాలు:

**నీటి సరఫరాలో ఏకరూపత.. గ్రిడ్ తరహా అనుసంధానం**

"జిహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లో నీటి సరఫరాలో పూర్తి ఏకరూపత ఉండాలి. నగర పరిసరాల్లో ఉన్న అన్ని తాగునీటి వనరులను పరస్పరం అనుసంధానించాలి. దీనివల్ల సాంకేతిక కారణాల వల్ల ఏదైనా ఒక వనరు నుంచి నీటి సరఫరా నిలిచిపోయినా, వెంటనే మరో వనరు ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిని అందించవచ్చు."

**3-4 రోజుల నిరీక్షణకు చెక్.. రోజు విడిచి రోజైనా నీళ్లు**

"మహానగరంలో ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు అందుతుండటం సరికాదు. ఈ పరిస్థితి వెంటనే మారాలి. ఆయా ప్రాంతాల్లో అత్యవసరంగా మౌలిక సదుపాయాలు కల్పించి, కనీసం రోజు విడిచి రోజు నీరు అందేలా

మిగతా 2లో

## చారిత్రక వారసత్వానికి
# ఆధునిక రూపు

**అసెంబ్లీ పునరుద్ధరణ పనులపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**



**అసెంబ్లీ భవన పనులను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి**
**నిర్మాణ శైలి దెబ్బతినకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన**
**స్పీకర్, మంత్రులు, ప్రజాప్రతినిధుల హాజరు**
**గడువులోగా 'హెరిటేజ్' లుక్ దెబ్బతినకుండా పునరుద్ధరణ పూర్తి చేయాలి**
**భావితరాలకు వారసత్వ కానుకగా అసెంబ్లీ భవనం...**
**నాణ్యతపై అధికారులకు ఆదేశాలు**

హైదరాబాద్ జులై 23:చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ (రినోవేషన్) పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శాసనసభ ప్రాంగణమంతా కలియతిరిగి పనుల పురోగతిని సమీక్షించిన సీఎం, సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుని పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**అసలు నిర్మాణ శైలికి భంగం కలగొద్దు**

శాసనసభ భవనం మన రాష్ట్ర చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భవనం యొక్క అసలు నిర్మాణం మరియు హెరిటేజ్ శైలికి ఎలాంటి భంగం కలగకుండా అత్యున్నత ప్రమాణాలతో పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిలోనూ నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు.

**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి**

శాసనసభ ప్రాంగణంలోని వివిధ విభాగాలను తనిఖీ చేసిన ముఖ్యమంత్రి, పనులన్నీ నిర్దేశిత సమయానికే పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక సౌకర్యాలను కల్పించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి నిలయమైన

మిగతా 2లో



## విదేశీ హస్తం?

**నీట్ నిరసనల వెనుక విదేశీ హస్తం?...**
**హైకోర్టును ఆశ్రయించిన పిటిషనర్**
**చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందుకు 'సంసద్ చలో' వివాదం**
**విద్యార్థుల ఆందోళనకు రాజకీయ రంగు...**



## ఢిల్లీలో 'ప్రజారవాణా' బంద్

**సుప్రీం తలుపు తట్టిన బార్ అసోసియేషన్**
**సమయానికి రాలేకపోతే కేసులు కొట్టివేయొద్దు...**
**న్యాయవాదులకు సుప్రీంకోర్టు భరోసా**
**ఇబ్బందులపై ప్రధాన న్యాయమూర్తి స్పందన**

## శాస్త్రీయ పరిశోధనలతోనే
# సింగరేణి ప్రగతి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
**కొత్తగూడెంలో రూపుదిద్దుకున్న అత్యాధునిక 'జియో సైన్స్ లేబరేటరీ' ప్రారంభం**
**బొగ్గు నాణ్యత, ఖనిజ విశ్లేషణలో కచ్చితత్వం పెరగాలి..**
**సాంకేతికతతోనే ఉత్పాదకత పెరుగుతుందని స్పష్టీకరణ**



కొత్తగూడెం, ప్రతినిధి: సింగరేణి సంస్థలో ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి శాస్త్రీయ విధానాలు, ఆధునిక సాంకేతికత అత్యంత కీలకమైనవి. పరిశోధనల ద్వారా లభించే కచ్చితమైన సమాచారంతో గనుల ప్రణాళిక, నాణ్యత నియంత్రణ, ఉత్పాదకతను భారీగా పెంచవచ్చు" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేట్ ప్రాంతంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో భూగర్భ శాస్త్ర పరిశోధనలు, ఖనిజాల విశ్లేషణను మరింత ఆధునికీకరించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'జియో సైన్స్ లేబరేటరీ' ని ఉప ముఖ్యమంత్రి గురువారం

మిగతా 2లో

## నేను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం..
# సీఎం రేవంత్ సిద్ధమా?

**గ్లోబరీనా నా బినామీ అయితే కాంగ్రెస్ ఎందుకు ఒప్పందం చేసుకుంది?**
**రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసులు ఇచ్చా..**
**ఆరోపణలు నిరూపించాలి లేదంటే క్షమాపణ చెప్పాలి**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**





## ఎర్రసముద్రంలో
# యుద్ధ మేఘాలు

**ప్రపంచ చమురు సరఫరాకు సెగ**
**సముద్ర మార్గాల్లో దాడుల కలకలం**
**ఎగబాకనున్న రవాణా ఛార్జీలు**
**గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో నిలిచిపోయిన నౌకలు**

## కానిస్టేబుల్ ఆత్మహత్య

**డీజీపీ కార్యాలయంలో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం**
**సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**
**ఘటనపై సమగ్ర దర్యాప్తు ప్రారంభం**



## ప్రశ్నించే గొంతులను
# అణచివేస్తారా?

**పేపర్ లీకేజీలు, నిరుద్యోగంతో యువత భవిష్యత్తు అంధకారం..**
**యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో బీజేపీ ప్రభుత్వం ఘోర వైఫల్యం**
**దేశానికి ప్రత్యామ్నాయ నాయకుడు రాహుల్ గాంధీనే..**
**యువత భయపడకుండా పోరాడాలి**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



# రగులుతున్న జంతర్ మంతర్

**ఢిల్లీలో కొనసాగుతున్న సీజేపీ నిరసనల హోరు...**
**ప్రధాన్ రాజీనామాకే పట్టు**
**'నీట్' రగడకు కేంద్రం ప్రతిపాదన... "రండి, కూర్చోండి, చర్చిద్దాం**
**ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల కీలక ఆదేశాలు**
**విద్యార్థి ఉద్యమంపై పెరిగిన రాజకీయ వేడి...**



న్యూఢిల్లీ జులై 23:నీట్ పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ప్రారంభమైన విద్యార్థి ఉద్యమం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. జూన్ 20 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఈ నిరసనలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజకీయ, న్యాయ, సామాజిక చర్చకు దారితీశాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుండగా, మరోవైపు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఎలాంటి రాజీ లేదని సీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

"ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చలకు సిద్ధం": కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

విద్యార్థులతో చర్చలకు ప్రభుత్వం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉన్నాయని కేంద్రమంత్రి

మిగతా 2లో

## విదేశీ హస్తం?...

**న్యూఢిల్లీ జులై 23:** నీట్ పేపర్ లీకేజీ అంశాన్ని నిరసిస్తూ నిర్వహించిన 'సంసద్ చలో' ఆందోళన వెనుక భారీ కుట్ర దాగి ఉందంటూ ఢిల్లీ హైకోర్టులో శనివారం ఒక ప్రజా ప్రయోజన పిటిషన్ దాఖలైంది. ఈ నిరసన కార్యక్రమానికి విదేశాల నుంచి పెద్ద ఎత్తున నిధులు అందినట్లు ఆరోపిస్తూ, దీనిపై తక్షణమే జాతీయ దర్యాప్తు సంస్థ చేత విచారణ జరిపించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు, శుక్రవారం రోజున విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించింది.

**ఎన్ఐఏ విచారణ కోరుతూ పిటిషన్**

సామాజిక కార్యకర్త సతీశ్‌కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ప్రముఖ న్యాయవాది బారున్ కుమార్ సిన్హా వాదనలు వినిపించనున్నారు. దేశ రాజధానిలో నిర్వహించిన 'సంసద్ చలో' నిరసనల కోసం విదేశీ సంస్థల నుంచి నిధులు సమకూరాయని పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులను తేల్చేందుకు ఎన్ఐఏ దర్యాప్తు అవసరమని పేర్కొన్నారు.

**రాజకీయ రంగు పులుముకున్న నిరసనలు**

మొదట విద్యార్థుల సమస్య అయిన 'నీట్ పేపర్ లీకేజీ' అంశంతోనే ఈ ఆందోళనలు ప్రారంభమైనప్పటికీ, కాలక్రమేణా ఇది రాజకీయ మలుపు తీసుకుందని పిటిషనర్ పేర్కొన్నారు. పలు రాజకీయ పార్టీల నేతలు, వివిధ వర్గాలు ఈ నిరసనలో చేరడంతో అంశం దిశ మారింది. అంతేకాకుండా, ఈ ధర్నాకు మద్దతు తెలిపిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు కూడా విదేశీ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని పిటిషన్‌లో ఆరోపించారు.

**స్తంభించిన జనజీవితం... రేపే విచారణ!**

ఈ నిరసనల కారణంగా ఢిల్లీలో సాధారణ జనజీవితం తీవ్రంగా స్తంభించిపోయిందని, విపరీతమైన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు అంగీకరించిన ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరపనుంది.

## ఢిల్లీలో 'ప్రజారవాణా' బంద్...

న్యూఢిల్లీ జులై 23:దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, వివిధ సంఘాల నిరసనల నేపథ్యంలో భద్రతా కారణాలతో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై గురువారం దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ప్రస్తావన వచ్చింది. మెట్రో సేవల నిలిపివేత కారణంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సమయానికి కోర్టుకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లారు.

**16 స్టేషన్లు బంద్... ప్రయాణికుల అవస్థలు**

సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో సహా దాదాపు 16 కీలక మెట్రో స్టేషన్లలో సేవలను ఢిల్లీ మెట్రో అకస్మాత్తుగా నిలిపివేసింది. దీంతో రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు కోర్టుకు వచ్చే లాయర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుప్రీంకోర్టు గుర్తింపు కార్డులు కలిగిన న్యాయవాదులు, రిజిస్ట్రీ సిబ్బందిని మెట్రో స్టేషన్‌లో దిగేందుకు అనుమతించి, బయటకు వెళ్లే సమయంలో భద్రతా తనిఖీలు నిర్వహించేలా వెసులుబాటు కల్పించాలని వికాస్ సింగ్ కోరారు.

**సుప్రీం సీజేఐ స్పందన: 'లాయర్లపై ప్రతికూల ఉత్తర్వులు వద్దు'**

ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించారు. మెట్రో అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఇప్పటికే సుప్రీంకోర్టు యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. మధ్యాహ్న భోజన విరామ సమయానికి ఈ సమస్య కొలిక్కి రాకపోతే తానే స్వయంగా జోక్యం చేసుకుంటానని స్పష్టం చేశారు. అంతేకాకుండా, మెట్రో మూసివేత వల్ల న్యాయవాదులు సకాలంలో హాజరుకాలేకపోయిన కేసుల్లో ఎలాంటి ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయవద్దని న్యాయమూర్తులకు సూచించినట్లు తెలపడంతో న్యాయవాదులకు పెద్ద ఊరట లభించింది.

**జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు**

'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మెట్రో స్టేషన్ల మూసివేత అమల్లో ఉంటుందని ఢిల్లీ మెట్రో ప్రకటించింది. అయితే పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, త్వరలోనే సేవలను పునరుద్ధరిస్తామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌కు 50 ఏళ్లపాటు నీటి కొరత ఉండొద్దు

చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కొనసాగుతున్న తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులన్నింటినీ రాబోయే ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలి."

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తత

"ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో తాగునీటి కొరత రాకుండా అధికారులు ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి సారించాలి. నీటి నిల్వలు, సరఫరా వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి."

**ప్రాజెక్టుల వేగవంతం.. శుద్ధి చేసిన నీటి వినియోగం**

న్యాయ చిక్కుల పరిష్కారం: "మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ఎక్కడైనా కోర్టు కేసులు లేదా న్యాయపరమైన చిక్కులు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి పనులు వేగవంతం చేయాలి."

రీసైకిల్ నీటి వినియోగం: "భవిష్యత్తులో పరిశ్రమలు, భారీ నిర్మాణ రంగ పనుల్లో తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని మాత్రమే వినియోగించేలా స్పష్టమైన నిబంధనలు రూపొందించి అమలు చేయాలి."

ప్రత్యేక డ్యాష్‌బోర్డు: "తాగునీటి సరఫరా, న్యూల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు ప్రతి నెల నాకు నివేదిక (రిపోర్ట్) సమర్పించాలి. పనులను నిరంతరం సమీక్షించేందుకు వీలుగా ఒక ప్రత్యేక డ్యాష్‌బోర్డును తక్షణమే అందుబాటులోకి తేవాలి."ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి, జాయింట్ ఎండి మయాంక్ మిట్టల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పరిశోధనలతోనే సింగరేణి ప్రగతి

ఘనంగా ప్రారంభించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెం చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ జె. అంకిత్ పూలమొక్క అందజేసి సాదర స్వాగతం పలికారు. ప్రారంభోత్సవం అనంతరం లేబరేటరీలోని అత్యాధునిక యంత్ర పరికరాలను డిప్యూటీ సీఎం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఖనిజాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ విధానాలు, నూతన సాంకేతికతపై సింగరేణి అధికారులు ఆయనకు వివరాలు అందించారు.సమావేశం మరియు పరిశీలన అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు

**పరిశోధనలకు మహర్దశ.. నాణ్యతకు పెద్దపీట**

"ఈ అత్యాధునిక జియో సైన్స్ లేబరేటరీ రాకతో ఖనిజాల నమూనాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ వేగవంతంగా, ఎంతో కచ్చితత్వంతో జరిగే అవకాశం ఏర్పడింది. గనుల నిర్వహణలో శాస్త్రీయ పరిశోధనలకు ఇది మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకుంటూ సింగరేణిని సరికొత్త అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలి."ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యుడు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జె. అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బి. రోహిత్ రాజు, సింగరేణి సీఎండీ ఎన్. బల్ రామ్, డైరెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఇతర సింగరేణి ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ లేబరేటరీ సింగరేణిలో పరిశోధనలకు, ఆధునిక గనుల నిర్వహణకు ఒక కీలక కేంద్రంగా (హబ్) నిలవనుందని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు.

## ఎర్రసముద్రంలో 'యుద్ధ' మేఘాలు...

**అంతర్జాతీయ విభాగాధిపతి:** ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన ఎర్రసముద్రంలో సముద్ర దాడులు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. సౌదీ అరేబియా నైరుతి తీరంలో ప్రయాణిస్తున్న ఒక చమురు ట్యాంకర్‌పై గుర్తుతెలియని క్షిపణి లేదా డ్రోన్‌తో దాడి జరగడంతో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. యునైటెడ్ కింగ్‌డమ్ సముద్ర వాణిజ్య కార్యకలాపాల పర్యవేక్షణ సంస్థ ఈ ఘటనను ధ్రువీకరించగా, యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు ఈ దాడి తామే చేసినట్లు అధికారికంగా ప్రకటించారు.

**అల్ షుకైక్‌కు సమీపంలో ఘటన**

సౌదీ అరేబియాలోని అల్ షుకైక్ ప్రాంతానికి నైరుతి దిశలో సుమారు 70 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి జరిగిన వెంటనే నౌకలోని సిబ్బంది సమయస్ఫూర్తితో అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, సముద్ర పర్యావరణానికి కూడా ఇప్పటివరకు ఎలాంటి విఘాతం కలగలేదని అధికారులు స్పష్టం చేశారు.

**సౌదీపై ఆంక్షలు... హౌతీల హెచ్చరికలు!**

సౌదీ ప్రభుత్వం తమ ఆధీనంలోని ప్రాంతాలపై దిగ్బంధం కొనసాగిస్తోందని ఆరోపిస్తూ... సౌదీ నౌకలపై సముద్ర నిషేధం విధిస్తున్నట్లు హౌతీ తిరుగుబాటుదారులు రెండు రోజుల క్రితమే ప్రకటించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే తాజాగా సౌదీకి చెందిన రెండు చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు హౌతీ వర్గాలు స్పష్టం చేశాయి. అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన బాబ్ ఎల్-మండేబ్ జలసంధి సమీపంలో ఈ దాడి జరగడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

**స్తంభిస్తున్న వాణిజ్యం... రవాణా ఖర్చులు పెరిగే ప్రమాదం!**

భద్రతా పరిస్థితులు వేగంగా దిగజారడంతో హర్మూజ్ మరియు బాబ్ ఎల్-మండేబ్ జలసంధుల మీదుగా వెళ్లే వాణిజ్య నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. హౌతీల దాడుల భయంతో అనేక ఓడలు గల్ఫ్ ఆఫ్ ఏడెన్ సమీపంలో ప్రయాణాన్ని నిలిపివేసి, సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాయి. దీనివల్ల సరుకు రవాణా (ఫ్రైట్) ఛార్జీలు విపరీతంగా పెరిగే అవకాశముందని, ఇది అంతర్జాతీయ చమురు ధరలు, ప్రపంచ సరఫరా వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని నౌకాయాన నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## చలిమంటై రగులుతున్న జంతర్ మంతర్

జితేంద్రసింగ్ స్పష్టం చేశారు.

"యువతకు ఇది ఒక సాదర ఆహ్వానం. జేపీ నడ్డా నివాసంలో గానీ, కార్యాలయంలో గానీ ఎక్కడైనా కూర్చుని మాట్లాడేందుకు సిద్ధం. ఎంత సమయమైనా కేటాయిస్తాం" అని ఆయన ప్రకటించారు. జూలై 20న సీజేపీ ప్రతినిధులు నడ్డాను కలిసి తమ వినతులను అందించగా, వాటిని ఉన్నతస్థాయిలో చర్చిస్తామని హామీ లభించింది.

సీజేపీ 3 కీలక డిమాండ్లు... తగ్గేదే లేదన్న సౌరవ్ దాస్

ఉద్యమం విరమించాలంటే ప్రభుత్వం 3 ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని సీజేపీ స్పష్టం చేసింది:

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణ రాజీనామా.లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున పరిహారం. శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసుల ఉపసంహరణ.సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "మంత్రి రాజీనామా చేసేవరకు పోరాటం ఆగేది లేదు" అని తెగేసి చెప్పారు. ఉద్యమంలోకి అసాంఘిక శక్తులు చొరబడకుండా జాగ్రత్త పడుతున్నామని, నిరసనలు పూర్తిగా శాంతియుతంగానే సాగుతాయని తెలిపారు.

**లాఠీచార్జ్‌పై మండిపడ్డ ప్రముఖులు... కదిలిన సుప్రీంకోర్టు**

జూలై 20న నిర్వహించిన 'సంసద్ చలో' వద్ద పోలీసులు జరిపిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి అంగ్మో స్పందిస్తూ, విద్యార్థులను నేరస్థుల్లా చూపించడం సరికాదని హితవు పలికారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తల్లి అనితా దీప్కే కూడా పోలీసుల ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు.మరోవైపు 16 మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ... న్యాయవాదులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, లాయర్లు హాజరుకాలేని కేసుల్లో ఎలాంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు ప్రధాని ఆదేశం... హైకోర్టులో దర్యాప్తు పిటిషన్లు**

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని వదిలిపెట్టబోమని, విచారణ వేగవంతం చేసేందుకు ప్రత్యేక 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. కాగా, ఈ ఉద్యమం వెనుక విదేశీ నిధులు, రాజకీయ కుట్రలు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్లను, అలాగే పోలీసు బలప్రయోగంపై దాఖలైన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించి, ఆధారాలు భద్రపరచాలని పోలీసులను ఆదేశించింది.

## నేను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం..

**వరంగల్, ప్రతినిధి:** "గ్లోబరీనా సంస్థపై నాపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. ఆ సంస్థ నిజంగానే నా బినామీ అయితే, మరి అదే సంస్థతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందో సమాధానం చెప్పాలి. ఒకవైపు ఒప్పందాలు చేసుకుంటూ, మరోవైపు నా బినామీ అనడం ఏంటి?" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని నిలదీశారు.వరంగల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**పరువు నష్టం దావా నోటీసులు.. సవాల్‌కు సిద్ధం!**

"గ్లోబరీనా అంశంలో నాపై లేనిపోని ఆరోపణలు చేసినందుకు గానూ ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరువు నష్టం దావాకు సంబంధించి న్యాయపరమైన నోటీసులు పంపించాను. నాపై చేసిన ఆరోపణలను ప్రభుత్వం ఆధారాలతో సహా నిరూపించాలి, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. ఈ అంశంలో సీఐడీ విచారణకు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. అవసరమైతే అబద్ధ నిర్ధారణ (లై డిటెక్టర్) పరీక్షకు కూడా నేను సిద్ధమే.. సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సిట్, లేదా సీఐడీ విచారణకు, లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా?"

**కాంగ్రెస్ - బీజేపీ చీకటి ఒప్పందాలు**

"కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ఆయన పేరు ఎత్తడానికే భయపడుతున్నారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం పెద్ద రాజకీయ నాటకం. సీఎం పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటూ రెండు పార్టీల మధ్య రాజీ రాజకీయాలు చేస్తున్నారు."

**మూటల పాలన నడుస్తోంది!**

"పాత కేసుల భయం, అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో రాజీ పడుతోంది. అందుకే సీఎం మోదీ పేరు చెప్పడానికి వణికిపోతున్నారు. ప్రశాంతంగా సాగాల్సిన రాష్ట్రంలో.. కాంగ్రెస్‌కు ఒక మూట, బీజేపీకి రెండు మూటలు పంపుతున్న పాలన నడుస్తోంది. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ఆరోపణలు మాని, ఇప్పటికైనా వాస్తవాలు వెల్లడించాలి."

## 'కబ్జా' కోటలు బద్దలు...

తిరుపతి (రెవెన్యూ విభాగం) జులై 23:తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో వైఎస్సార్సీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం వేగంగా చర్యలు చేపట్టింది. సర్వే నంబర్ 47/1లోని 5.1 ఎకరాలు, అలాగే సర్వే నంబర్ 47/5లోని 3.7 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు.

**జేసీబీలతో కూల్చివేతలు... భారీ భద్రత**

స్వాధీనం చేసుకున్న స్థలాల వద్ద 'ఇది ప్రభుత్వ భూమి' అని స్పష్టం చేస్తూ అధికారులు హెచ్చరిక బోర్డులను నాటారు. ఆక్రమిత భూముల చుట్టూ నిర్మించిన భారీ ప్రహారీ గోడలను జేసీబీ యంత్రాల సహాయంతో రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వందలాది మంది పోలీసులతో ప్రభుత్వం అక్కడ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది.

**సాధు పరిషత్ స్వాముల పర్యటన నిలిపివేత**

ఈ ఘటన నేపథ్యంలో భూమన ఆక్రమిత భూములను పరిశీలించేందుకు వచ్చిన ఏపీ సాధు పరిషత్ స్వాములను పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వారు కొంత దూరంలో మీడియాతో మాట్లాడారు. భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబంపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని తిరుపతి ప్రజలు త్వరలోనే తరిమికొడతారని హెచ్చరించారు.

**కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు**

భూమన భూకబ్జాల నుంచి ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకున్నందుకు ఏపీ సాధు పరిషత్ గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణలకు గురైన రెవెన్యూ రికార్డులను సైతం తక్షణమే నవీకరించాలని సూచించారు. భూమన కుటుంబ సభ్యులు అధికారులను, పోలీసులనే బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూబకాసురుల భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చారిత్రక వారసత్వానికి ఆధునిక రూపు...

ఈ భవనాన్ని భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

సమీక్షలో పాల్గొన్న స్పీకర్, ప్రజాప్రతినిధులు

ఈ పరిశీలన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పనుల ప్రస్తుత స్థితి, తదుపరి ప్రణాళికలను అధికారులు సీఎంకు వివరించారు. పనుల్లో ఎలాంటి రాజీ పడకుండా వేగవంతం చేసి, తెలంగాణ శాసనసభ వైభవాన్ని మరింత పెంపొందించాలని సీఎం అధికారులకు సూచించారు.



## ప్రశ్నించే గొంతులను అణచివేస్తారా?

**హైదరాబాద్, ప్రతినిధి:** "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. విపరీతంగా పెరిగిన నిరుద్యోగం, ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాల వల్ల విద్యార్థులు, యువత తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వంపై యువతలో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరింది" అని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.

**అణచివేత రాజకీయాలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం**

"యువత, విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలుపుతుంటే, వారి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోంది. హక్కుల కోసం ప్రశ్నించే స్వరాలను అరెస్టులు, బెదిరింపులతో భయపెట్టాలని చూడడం ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధం."

యువతకు అండగా రాహుల్ గాంధీ.. ఆయనే ప్రత్యామ్నాయం

"ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ యువతకు అండగా నిలుస్తూ నిరంతరం వారి గళాన్ని వినిపిస్తున్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన రాజీలేని పోరాటం చేస్తున్నారు. ప్రేమ, న్యాయం, సమానత్వమే ప్రాతిపదికగా సాగుతున్న రాహుల్ గాంధీ రాజకీయాలపై దేశ యువత, మేధావులు, మధ్యతరగతి ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోంది. నేడు దేశానికి ఆయనే బలమైన ప్రత్యామ్నాయ నాయకుడిగా ఎదుగుతున్నారు."

**తెలంగాణలో సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన**

"తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యమిస్తోంది. ప్రజల సమస్యలను పరిష్కరించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం."

"దేశ యువత ఏమాత్రం భయపడకుండా తమ హక్కులు, భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగాలి. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది."

--- కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మంత్రి

## కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్, జూలై 23 : హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో గురువారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి అనే పోలీసు సిబ్బంది తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో పోలీసు శాఖలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం, రాత్రి విధులు నిర్వహిస్తున్న స్వామి ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో కార్యాలయంలోని వాష్‌రూమ్‌లోకి వెళ్లారు. అక్కడ తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సహచర సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.ఘటనాస్థలంలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన మరణానికి భార్య, పిల్లలకు ఎలాంటి సంబంధం లేదని, వారిని ఎవరూ ఇబ్బంది పెట్టవద్దని కోరినట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబాన్ని ఎల్లప్పుడూ కాపాడాలని భావిస్తున్నానని రాసిన ఆయన చివరి సందేశం అందరినీ కలచివేసింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత, కుటుంబ, ఉద్యోగ సంబంధిత అంశాలతో పాటు ఇతర పరిస్థితులను కూడా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సూసైడ్ నోట్‌లోని వివరాలను విశ్లేషిస్తూ పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది.

ఈ ఘటన నేపథ్యంలో పోలీసు సిబ్బందిపై విధి ఒత్తిళ్లు, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన మానసిక ఆరోగ్య సహాయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని ఆధారాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, అనంతర చట్టపరమైన ప్రక్రియ చేపట్టారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

# మహానగరాల్లో మౌన తరంగాలు

## ఉమ్మడి కుటుంబాల నుంచి ఒంటరి పోరాటాల వైపు...

**సంపాదకీయం**

ఒకప్పుడు భారతీయ సమాజానికి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వెన్నెముకగా ఉండేది. ఒకే కప్పు కింద కుటుంబ సభ్యులందరూ కలిసి జీవించడం, సుఖదుఃఖాలను పంచుకోవడం, కష్ట సమయాల్లో ఒకరికొకరు కొండంత అండగా నిలవడం మన సంస్కృతిలోనే ప్రాణవాయువుగా ఉండేది. అయితే వేగంగా మారుతున్న జీవనశైలి, విపరీతమైన నగరీకరణ, ఉద్యోగ--ఉపాధి అవకాశాల కోసం వలసలు మరియు సాంకేతికతపై అధిక ఆధారపడటం వంటి కారణాలతో నేడు నగరాల్లో ఒంటరిగా జీవించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, ఆర్థిక స్వావలంబన వంటి తాత్కాలిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ... కాంక్రీట్ వనాల మధ్య మనుషులు 'ఒంటరి ద్వీపాల్లా' మారిపోతుండటం సమాజంపై తీవ్రమైన, కనిపించని ప్రభావాన్ని చూపుతోంది.

కోట్లాది జనం మధ్య కొరవడిన ఆత్మీయత

ఉన్నత విద్య, వృత్తిగత ప్రగతి సాధించేందుకు యువత పెద్ద ఎత్తున మహానగరాలకు తరలివస్తోంది. కుటుంబాలకు దూరంగా అద్దె గదులు, హాస్టళ్లు, చిన్నపాటి ఫ్లాట్లలో ఒంటరి జీవితం గడపడం నేడు సర్వసాధారణమైంది. ఉద్యోగ ఒత్తిళ్లు, గంటల కొద్దీ ప్రయాణ సమయం, పోటీ ప్రపంచపు పరుగు పందెంలో సామాజిక అనుబంధాలకు సమయమే దొరకడం లేదు. ఒకే అపార్ట్‌మెంట్‌లో ఏళ్ల తరబడి నివసిస్తున్నా, పక్క పోర్షన్ వారి పేరు కూడా తెలియని విచిత్రమైన వాతావరణం నగరాల్లో నెలకొంది. లక్షల మంది జనం నడుమ ఉన్నప్పటికీ, అంతరంగంలో పెరిగిపోతున్న ఈ ఏకాంతం ఆధునిక నగర జీవనానికి కొత్త నిర్వచనంగా మారుతోంది.

సాంకేతికత తెచ్చిన 'డిజిటల్ ఏకాంతం'

ఈ ఒంటరి జీవనం ముఖ్యంగా మానసిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతోంది. నేరుగా మనుషులతో మాట్లాడే అవకాశాలు తగ్గడం, భావోద్వేగాలను పంచుకునే భరోసా లేకపోవడం వల్ల నేటి తరం తీవ్ర ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి సమస్యల బారిన పడుతోందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్నా, సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో వర్చువల్ పరిచయాలు ఉన్నా... గుండెల్లోని ఖాళీతనాన్ని నింపే నిజమైన ఆత్మీయత కరువైంది. 'స్క్రీన్ల వెనుక సమ్మేళనం... మనసుల్లో ఏకాంతం' అనే వాతావరణం వల్ల నగరాల్లో మానసిక ఆరోగ్య సేవల అవసరం నానాటికీ పెరుగుతోంది.

బలహీనపడుతున్న భావోద్వేగ భరోసా ఽ భద్రత

ఈ మార్పు కుటుంబ బంధాల మూలాలను సైతం కదిలిస్తోంది. ఉద్యోగాల రీత్యా తల్లిదండ్రులు ఒక నగరంలో, పిల్లలు మరొక చోట, వయోవృద్ధులు



స్వగ్రామాల్లో ఉండాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దీనివల్ల తరాల మధ్య అనుబంధాలు బలహీనపడుతున్నాయి. పిల్లలు తాతయ్యలు, అమ్మమ్మల ఆప్యాయతలకు దూరమవుతుంటే... వృద్ధులు జీవిత సంధ్యాసమయంలో తీవ్రమైన ఒంటరితనంతో అల్లాడిపోతున్నారు. మరోవైపు సామాజిక భద్రత కూడా ప్రశ్నార్థకమవుతోంది. హఠాత్తుగా అనారోగ్యానికి గురైనా, ఏదైనా ప్రమాదం జరిగినా అత్యవసర సమయంలో పలకరించే వారు, సహాయం చేసే వారు సమీపంలో లేకపోవడం ప్రాణాంతకంగా మారుతోంది. పొరుగువారితో పరిచయాలు లేని అపార్ట్‌మెంట్ సంస్కృతిలో అత్యవసర సహాయం అందడంలో జరుగుతున్న ఆలస్యం అనేక విషాదాలకు దారితీస్తోంది.

కలిసి జీవించడమే ఆరోగ్యకర సమాజానికి పునాది

ఒంటరిగా జీవించడం తప్పు కాకపోవచ్చు; వ్యక్తిగత వికాసానికి, స్వతంత్ర నిర్ణయాలకు అది దోహదపడవచ్చు. కానీ, ఆ ఒంటరితనమే జీవితాన్ని పూర్తిగా ఆక్రమించకుండా చూసుకోవడం అత్యంత ఆవశ్యకం. కుటుంబ సభ్యులతో నిరంతరం డిజిటల్ పరంగానే కాక భౌతికంగానూ సమయం గడపడం, స్నేహితులను కలవడం, సామాజిక సేవా కార్యక్రమాలు, పుస్తక పఠనం, క్రీడలు వంటి అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. కార్పొరేట్ సంస్థలు కూడా ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి, వారి మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే, నగర ప్రణాళికల్లో కేవలం కాంక్రీట్ భవనాలు కాకుండా, ప్రజలు పరస్పరం కలుసుకునే కమ్యూనిటీ పార్కులు, రచ్చబండల్లాంటి ప్రదేశాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. నగరాల అభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, విస్తృతమైన రహదారులు మాత్రమే కాదు... మనుషుల మధ్య ఉండే పరస్పర ఆప్యాయతలు, సామాజిక అనుబంధాలే నిజమైన అభివృద్ధికి కొలమానాలు. భవనాల ఎత్తుల్లో కాకుండా, తోటి మనిషికి అందించే చేయూతలోనే ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజ పునాదులు దాగి ఉన్నాయి.

# అసోంలో వరదల విలయం

అసోం జూలై 23 : అసోంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధాన నదులన్నీ ఉగ్రరూపం దాల్చి ప్రమాద హెచ్చరిక స్థాయులను దాటి ప్రవహిస్తుండటంతో వరద పరిస్థితి రోజురోజుకూ మరింత విషమంగా మారుతోంది. అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, వేలాది కుటుంబాలు ఇళ్లను వదిలి సహాయ శిబిరాలకు తరలాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు తెగిపోవడంతో సహాయక చర్యలు కూడా సవాలుగా మారాయి. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం గత 24 గంటల్లో నలుగురు చిన్నారులతో పాటు మొత్తం పది మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది వరదలు, వర్షాలకు సంబంధించిన మరణాల సంఖ్య 41కు చేరింది. శివసాగర్ జిల్లాలో ముగ్గురు, జోర్హాట్ జిల్లాలో ముగ్గురు, చరైడియో జిల్లాలో ఇద్దరు, ధేమాజీ, కర్బీ అంగ్లాంగ్ జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మరో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతైనట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లోని 40 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని 939 గ్రామాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. దాదాపు 6.53 లక్షల మందికిపైగా ప్రజలు వరదలతో తీవ్రంగా ప్రభావితమయ్యారు. బ్రహ్మపుత్ర నదితో పాటు దాని ఉపనదులైన దిసాంగ్, బుర్హిదిహింగ్, దిఖౌ, ధన్సిరి, కుషియారా నదులు ప్రమాదకర స్థాయులను దాటి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా నంగ్లామురాఘాట్ వద్ద దిసాంగ్ నది ఇప్పటివరకు నమోదైన అత్యధిక ప్రమాద స్థాయిని దాటి



ప్రవహిస్తుండటం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. వరదల కారణంగా వ్యవసాయ భూములు నీటమునిగిపోయి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పశువులకు మేత కొరత ఏర్పడగా, 1.38 లక్షలకు పైగా మూగజీవాలు కూడా వరద ప్రభావానికి గురయ్యాయి. విద్యుత్ సరఫరా, తాగునీటి వ్యవస్థలు దెబ్బతినడంతో అనేక గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య బృందాలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 487 సహాయ శిబిరాలు, పంపిణీ కేంద్రాల్లో ప్రస్తుతం 3.13 లక్షల మందికిపైగా బాధితులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, అవసరమైన నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. జిల్లా యంత్రాంగాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తున్నాయి. సహాయక చర్యల్లో భారత సైన్యం, జాతీయ విపత్తు స్పందన దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం, భారత వాయుసేన, అగ్నిమాపక శాఖ, పౌర రక్షణ బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఒక్కరోజులోనే 8,400 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వరద ధాటికి 53 రహదారులు, ఆరు కట్టలు పూర్తిగా ధ్వంసమవడంతో రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగుల సమీపానికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.





## భూమికి దూరమవుతున్న చంద్రుడు



న్యూఢిల్లీ, జూలై 23: భూమికి సహజ ఉపగ్రహమైన చంద్రుడు ప్రతి ఏడాది సుమారు 3.83 సెంటీమీటర్ల వేగంతో భూమికి దూరమవుతున్నాడని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ వేగం మనిషి గోర్లు పెరిగే వేగంతో సమానమే అయినప్పటికీ, కోట్లాది సంవత్సరాల కాలంలో ఇది భూమిపై గణనీయమైన మార్పులకు దారితీసే అవకాశముందని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ మార్పు చాలా నెమ్మదిగా జరుగుతున్నందున తక్షణ ప్రభావం ఉండదని కూడా స్పష్టం చేస్తున్నారు. చంద్రుడి కక్ష్యలో వస్తున్న ఈ మార్పులను అత్యంత కచ్చితత్వంతో పరిశీలించేందుకు అపోలో వ్యోమగాములు 1969 నుంచి 1971 మధ్య చంద్రుడి ఉపరితలంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక లేజర్ ప్రతిబింబ పరికరాలు కీలకంగా ఉపయోగపడుతున్నాయి. భూమి నుంచి పంపిన లేజర్ కిరణాలు చంద్రుడిపై తాకి తిరిగి రావడానికి పట్టే సమయాన్ని విశ్లేషించడం ద్వారా భూమి--చంద్రుడి మధ్య దూరంలో ప్రతి ఏడాది చోటుచేసుకుంటున్న స్వల్ప మార్పులను శాస్త్రవేత్తలు ఖచ్చితంగా నమోదు చేస్తున్నారు. గత ఐదు దశాబ్దాలుగా ఈ పరిశీలనలు నిరంతరంగా కొనసాగుతున్నాయి.

ఈ మార్పుకు ప్రధాన కారణం భూమి భ్రమణం, చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి, సముద్ర అలల ప్రభావం వల్ల ఏర్పడే ఘర్షణ అని శాస్త్రవేత్తలు వివరించారు. భూమి తన అక్షంపై వేగంగా తిరుగుతుండగా సముద్ర అలలు చంద్రుడి గురుత్వాకర్షణకు ప్రతిస్పందిస్తాయి. ఈ ప్రక్రియలో భూమి భ్రమణ శక్తిలో కొంత భాగం చంద్రుడికి బదిలీ అవుతుంది. ఫలితంగా చంద్రుడు క్రమంగా మరింత ఎత్తైన కక్ష్యలోకి వెళ్లి భూమికి దూరమవుతుండగా, భూమి భ్రమణ వేగం స్వల్పంగా తగ్గుతోంది. ఈ పరిణామం దీర్ఘకాలంలో భూమిపై రోజు నిడివిపై ప్రభావం చూపనుంది. ప్రస్తుతం ప్రతి శతాబ్దానికి ఒకటి నుంచి రెండు మిల్లీ సెకన్ల మేర రోజు పొడవు పెరుగుతోందని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. సుమారు 100 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజు కేవలం 19 గంటలే ఉండేదని భూగర్భ, ఖగోళ అధ్యయనాలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రక్రియ కొనసాగితే రోజుల నిడివి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరో కీలక ప్రభావం సంపూర్ణ సూర్యగ్రహణాలపై పడనుంది. ప్రస్తుతం భూమి నుంచి చూసినప్పుడు చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపించడం వల్లే సంపూర్ణ సూర్యగ్రహణాలు ఏర్పడుతున్నాయి. అయితే చంద్రుడు క్రమంగా మరింత దూరమవుతుండటంతో ఆకాశంలో అతని పరిమాణం చిన్నదిగా కనిపిస్తుంది. దీంతో సుమారు మరో 60 కోట్ల సంవత్సరాల తర్వాత సంపూర్ణ సూర్యగ్రహణాలు భూమిపై కనిపించకపోవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఆ సమయంలో వలయాకార సూర్యగ్రహణాలు మాత్రమే ఎక్కువగా కనిపించే అవకాశం ఉందని చెబుతున్నారు. చంద్రుడి గురుత్వాకర్షణ ప్రభావం తగ్గడంతో సముద్ర అలల తీవ్రత కూడా క్రమంగా తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. దీని ప్రభావం తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలు, సముద్ర జీవుల పునరుత్పత్తి చక్రాలు, చేపల వనరులు, సముద్ర జీవ వైవిధ్యంపై దీర్ఘకాలంలో కనిపించవచ్చని అభిప్రాయపడుతున్నారు. సముద్ర అలలపై ఆధారపడే అనేక సహజ ప్రక్రియల్లో కూడా మార్పులు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే ఈ పరిణామాలన్నీ లక్షల నుంచి కోట్ల సంవత్సరాల వ్యవధిలోనే క్రమంగా చోటుచేసుకుంటాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం చంద్రుడు భూమికి దూరమవుతున్న వేగం అత్యంత స్వల్పంగా ఉండటంతో మానవాళి తక్షణ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అయినప్పటికీ భూమి--చంద్రుడి మధ్య సంబంధం, ఖగోళ గమనాలు, భూమి భవిష్యత్ పరిణామాలను అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధనలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## ఆగాపే ఆశ్రమంలో అనాథ పిల్లలకుదాతలు చేయూత

యాడికి మండలం, కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీ లో ఉన్న అగాపే ఆశ్రమంలో ఉంటున్న అనాథ పిల్లలకు కొంతమంది దాతలు సహాయం చేయడం జరిగింది. గత రెండు నెలల క్రితం పెద్దపేట గ్రామంలో తండ్రిని కోల్పోయి తల్లి జైలుకెళ్లడం ద్వారా అనాథలుగా మిగిలిన నలుగురు పిల్లల గూర్చి ఆలోచించి,వారికి తమ వంతుగా సహాయం చేయాలని తలంచి మాజీ మండల కన్వీనర్ రుద్రమ నాయుడు ఆధ్వర్యంలో రాయలచెరువు ప్రాంతానికి చెందిన మాదాల విశ్వనాథ్ నాయుడు, కత్తి శ్రీనివాసులు, ఏసీ వెంకట్ నారాయణ, మోటుపల్లి బాలు రంగయ్య, చెన్నంపల్లి సంజప్ప, మోటుపల్లి జయరాముడు మరియు నరసింహ చౌదరి, నీలకంఠారెడ్డి వీరందరూ కలిసి అగాపే ఆశ్రమం ఫౌండర్ బత్తల ప్రసాద్ కి పిల్లల భవిష్యత్తు నిమిత్తమై 21,800 రూపాయలు ఆయనకు అందజేశారు. అంతేకాకుండా వారికి సంబంధించి ఇంకా ఏమైనా మేము సహాయం చేస్తామని, ఆశ్రమానికి కూడా మేము ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రసాదకి భరోసా ఇచ్చారు. ఆ నలుగురు పిల్లలతో పాటు ఫౌండర్ ప్రసాద్ కూడా వారికి చేసిన సహాయాన్నిబట్టి కృతజ్ఞతలు తెలిపి ఆనంద వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ పర్యవేక్షణలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ



**నిర్మల్ జిల్లా, జూలై 23(ప్రజా ముద్ర న్యూస్) :** నిర్మల్ జిల్లా పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ఓటరు సవరణ ప్రక్రియ పురోగతిని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రోజువారీగా అందుతున్న నివేదికలను ఆయన నిశితంగా పరిశీలిస్తూ, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మరియు సూపర్వైజర్లతో



నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను అందిస్తున్నారు. జిల్లాలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యేలా అవసరమైన సూచనలు ఇస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కు కోల్పోకూడదనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే భోజ్జు వెల్లడించారు.

## యాదాద్రిలో వరుణ యాగం పూర్ణాహుతి

యాదాద్రి, జూలై 23 : రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గురువారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ప్రకృతిని దైవస్వరూపంగా భావిస్తారని పేర్కొన్నారు. వరుణ యాగం కేవలం వైదిక క్రతువు మాత్రమే కాకుండా ప్రకృతి సమతుల్యత, ప్రజల శ్రేయస్సు, రైతాంగ సంక్షేమం కోసం నిర్వహించే పవిత్ర యాగమని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, నదులు, జలాశయాలు నిండుకుండల్లా కళకళలాడాలని, రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని మంత్రి చెప్పారు. పచ్చని తెలంగాణ మరింత పచ్చదనంతో విరాజిల్లాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రకృతి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే చర్యలతో పాటు దైవానుగ్రహం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రాష్ట్ర ప్రజల శాంతి, సుభిక్షాల కోసం ఈ యాగాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రతి రైతు కుటుంబంలో ఆనందం నెలకొనాలని ఆకాంక్షించారు. వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొని రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని ప్రార్థించారు.



# జర్నలిస్టుల బస్ పాస్‌ల గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు

### ఐ డ పిఆర్ స్పెషల్ కమిషనర్ వెల్లడి..




హైదరాబాద్, జూలై 23(ప్రజా ముద్ర న్యూస్) : తెలంగాణలోని రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అక్రిడిటెడ్ జర్నలిస్టులకు సమాచార, పౌర సంబంధాల శాఖ శుభవార్త తెలిపింది. 2024--2026 కాలపరిమితికి సంబంధించిన అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఆగస్టు 3 వరకు పొడిగించిన దృష్ట్యా, పాత బస్ పాస్‌ల గడువును కూడా అదే తేది వరకు పొడిగించాలని టీజీఎస్ఆర్టీసీ ని కోరినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ తెలిపారు.జులై 23తో ముగియనున్న పాత బస్ పాస్‌ల కాలపరిమితిని జులై 23 నుంచి ఆగస్టు 3, 2026 వరకు (మరో 12 రోజుల పాటు) పొడిగించి, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

కొత్త అక్రిడిటేషన్ల జారీ: 2026--2028 సంవత్సరాలకు సంబంధించి నూతన అక్రిడిటేషన్ కార్డులు ఇప్పటికే పలువురు జర్నలిస్టులకు అందజేయగా, మిగిలిన వారికి జారీ చేసే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది.కొత్త అక్రిడిటేషన్ కార్డులు మరియు కొత్త బస్ పాస్‌లు పరిపూర్ణంగా అందే వరకు, పాత బస్ పాస్‌లనే ప్రామాణికంగా తీసుకుని చెల్లుబాటులో ఉంచాలని నిర్ణయించారు.జూలై 23 నుండి ఆగస్టు 3 వరకు పాత పాస్‌లపై ప్రయాణించే జర్నలిస్టులకు సహకరించాల్సిందిగా ఆర్టీసీ అధికారులను, కండక్టర్లను కోరడం జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూరనుంది.

## బ్రిక్స్ వేదికపై చిరుధాన్యాల ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, జూలై 23 :** బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల 16వ సమావేశంలో చిరుధాన్యాల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను చాటిచెప్పే ప్రత్యేక ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ 'సరైన ఆహారం--భారత్' కార్యక్రమం కింద ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయగా, సభ్య దేశాల ఆరోగ్య మంత్రులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రులు అనుప్రియా పటేల్, ప్రతాప్‌రావు జాధవ్‌తో పాటు బ్రిక్స్ సభ్య దేశాలు, అధికార భాగస్వామ్య దేశాల ఆరోగ్య మంత్రులు, ప్రతినిధులు పాల్గొని చిరుధాన్యాల ఆధారిత ఆహార పదార్థాలను పరిశీలించారు. చిరుధాన్యాల్లోని పోషకాలు, ఆరోగ్య పరిరక్షణలో వాటి పాత్రపై నిర్వాహకులు వివరించారు. చిరుధాన్యాలు సమతుల్య ఆహారంలో కీలక భాగమని, మధుమేహం, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులను తగ్గించడంలో ఇవి ఉపయోగకరమని కార్యక్రమంలో వివరించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు ప్రకృతి అనుకూల ఆహార వ్యవస్థలను ప్రోత్సహించడంలో చిరుధాన్యాల పాత్ర ఎంతో కీలకమని ప్రతినిధులకు తెలియజేశారు.వ్యవసాయానికి అనుకూలమైన, తక్కువ నీటితో పండే చిరుధాన్యాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పోషకాహార భద్రతను కూడా సాధించవచ్చని సమావేశంలో ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన, సుస్థిర ఆహార విధానాలను ప్రోత్సహించేందుకు సభ్య దేశాలు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డాయి. బ్రిక్స్ వేదికపై చిరుధాన్యాల ప్రాముఖ్యతను ప్రదర్శించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహార అలవాట్లపై ప్రపంచ దేశాలకు స్పష్టమైన సందేశం అందిందని నిర్వాహకులు తెలిపారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య ప్రజారోగ్యం, పోషకాహారం, సుస్థిర అభివృద్ధి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పాన్ని ఈ సమావేశం మరోసారి చాటిచెప్పింది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో చిరుధాన్యాల వినియోగాన్ని విస్తరించేందుకు ఉమ్మడి కృషి కొనసాగించాలని సభ్య దేశాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.





## యంగ్ ఇండియా పాఠశాల పనుల పరిశీలన

### నిర్మాణ నాణ్యతపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష

### గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

### విద్యార్థులకు అత్యాధునిక వసతులే లక్ష్యం

జగిత్యాల, జూలై 23 : ధర్మపురి నియోజకవర్గంలోని నేరెళ్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. నిర్మాణంలో ఉన్న విద్యా భవనాలు, తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, భవనాల రూపకల్పన, ఇతర సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి రాజీ లేకుండా పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు.పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక విద్యా వాతావరణానికి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంలో ఈ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. నిర్మాణ పనులను నిరంతరం సమీక్షిస్తూ గడువులోగా పూర్తిచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.





# రాష్ట్ర శ్రేయస్సుకు మంత్రి ప్రత్యేక పూజలు

## సమృద్ధి వర్షాల కోసం ఆలయాల్లో ప్రార్థనలు
## రైతాంగ సంక్షేమం కోరుతూ యాగాల్లో పాల్గొన్న పొన్నం
## ఎల్‌నినో ప్రభావం తొలగాలని ఆకాంక్ష

హుస్నాబాద్, జూలై 23 రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా హుస్నాబాద్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, అనంతరం అయ్యప్ప ఆలయంలో 108 మంది రుత్వికులు, 21 హోమగుండాలతో నిర్వహించిన శ్రీ వారాహి మూలమంత్ర హోమ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించారు.



తదుపరి శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 108 కలశాలతో మరకత శివాలయంలో నిర్వహించిన వరుణ యాగంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, వ్యవసాయం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోందని మంత్రి పేర్కొన్నారు. దేవతల అనుగ్రహంతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ రంగం పుంజుకోవాలని, రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, రైతు సంతోషంగా ఉంటే వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తులవారు సహా సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందుతుందని మంత్రి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సంక్షేమంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం కూడా ప్రార్థించాలని పిలుపునిచ్చారు. ఈ మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వేద పండితులు, నిర్వాహకులు, యజ్ఞ దంపతులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# క్యాన్సర్ నియంత్రణకు ముందస్తు పరీక్షలే కీలకం

హైదరాబాద్, జూలై 23 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న స్టార్ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక నొప్పి నివారణ, ఉపశమన వైద్య సేవలను మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు గురువారం ప్రారంభించారు. క్యాన్సర్ బాధితులకు సమగ్ర, రోగి కేంద్రిత వైద్య సేవలు అందించే దిశగా ఆసుపత్రి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. క్యాన్సర్ చికిత్స అనేది కేవలం వ్యాధిని నయం చేయడానికే పరిమితం కాకుండా, రోగుల బాధలను తగ్గించడం, వారికి గౌరవప్రదమైన జీవితం, మెరుగైన జీవన నాణ్యత కల్పించడంపైనా దృష్టి సారించాలని వెంకయ్య నాయుడు అన్నారు. రోగిని కేంద్రబిందువుగా చేసుకుని వైద్య సేవలు అందించడం వైద్య రంగంలో గొప్ప మార్పునకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు.ఆధునిక క్యాన్సర్ చికిత్సలో నొప్పి నివారణ, ఉపశమన వైద్య సేవలు ఎంతో కీలకమని ఆయన చెప్పారు. ఇవి చివరి దశ రోగులకు మాత్రమే కాకుండా, చికిత్స ప్రారంభమైనప్పటి నుంచే అందుబాటులో ఉండాలని సూచించారు. క్యాన్సర్ నిపుణులు, ఉపశమన వైద్య నిపుణులు సమన్వయంతో పనిచేస్తే రోగులకు మరింత మెరుగైన ఫలితాలు లభిస్తాయని తెలిపారు. క్యాన్సర్‌కు జన్యుపరమైన కారణాలతో పాటు పర్యావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత లోపం, ఆధునిక జీవనశైలి వంటి అనేక అంశాలు కారణమవుతున్నాయని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. అందువల్ల క్యాన్సర్ నివారణకు దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ముఖ్యంగా ప్రమాద అవకాశాలు ఎక్కువగా ఉన్నవారు ముందస్తు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని ఆయన సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు పెరుగుతాయని, ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్‌పై సమర్థవంతమైన పోరాటానికి ఆధునిక వైద్యం, ముందస్తు నిర్ధారణ, ప్రజల్లో అవగాహన, ఉపశమన వైద్య సేవలు సమన్వయంతో సాగాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు వైద్య సంస్థలు మరింత కృషి చేయాలని సూచించారు.







# ఆర్మీ భూమి రక్షణకు హైడ్రాను ఆశ్రయించిన అధికారులు




హైదరాబాద్, జూలై 23: ఆర్మీకి చెందిన భూమిపై జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ రక్షణ శాఖ అధికారులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జై సింగ్ భూమి ఆక్రమణకు సంబంధించిన వివరాలను కమిషనర్‌కు వివరించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని జీఎల్ఆర్ సర్వే నంబర్ 507లో ఆర్మీకి చెందిన ఏ--1 భూమి ఉందని, ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్మీ భూమిని ఆక్రమించి అనుమతులు లేకుండానే జీ ప్లస్--2 భవన నిర్మాణం చేపట్టినట్లు ఆరోపించారు.అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రక్షణ శాఖ అధికారులు హైడ్రాను కోరారు. రక్షణ శాఖకు చెందిన భూములపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని




వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంబంధిత అధికారులకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.భూమి యాజమాన్యం, నిర్మాణ అనుమతులు, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, రక్షణ శాఖ భూముల పరిరక్షణ విషయంలో రాజీ పడబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌తో జరిగిన సమావేశంలో హైడ్రా సహాయ పోలీసు కమిషనర్ ఉమామహేశ్వరరావు కూడా పాల్గొన్నారు. ఫిర్యాదుపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

గోరంట్ల,:గోరంట్ల మండలం లోని గుంటిపల్లి తండాలో కాపురం ఉంటున్న ఇంటర్ విద్యార్థిని అదృశ్యం కావడంతో తండ్రి రవి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు,విద్యార్థిని పట్టణం లోని ఒక కళాశాలలో ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు.

# అమెరికాలో తెలంగాణ అభివృద్ధిపై చర్చ

డల్లాస్ (టెక్సాస్), జూలై 23 : అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలో తెలంగాణ కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్ విదేశీ విభాగం నాయకత్వంతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ విదేశీ విభాగం అమెరికా సభ్యుడు అచ్యుత్ తుమ్మల నివాసంలో నిర్వహించిన ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి, ప్రవాస భారతీయుల పాత్ర, ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విదేశాల్లో నివసిస్తున్న ప్రవాస భారతీయులు అందిస్తున్న సహకారాన్ని మంత్రి సీతక్క అభినందించారు. మాతృభూమి పట్ల వారు చూపుతున్న ఆప్యాయత, సేవా భావం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. డల్లాస్ తెలంగాణ కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్ విదేశీ విభాగం నాయకులు అందించిన ఆతిథ్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతున్న వారి సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రవాస భారతీయుల సూచనలు, సహకారం ఎంతో విలువైనవని మంత్రి పేర్కొన్నారు. విద్య,



ఆరోగ్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధి వంటి రంగాల్లో ప్రవాసుల భాగస్వామ్యంతో మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు.సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం



చేపడుతున్న కార్యక్రమాలకు ప్రవాస భారతీయులు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు రాష్ట్ర పురోగతికి నిరంతరం అండగా నిలుస్తుండటం గర్వకారణమని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ వాసుల సహకారంతో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.

# బీజేపీ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలనీ కాంగ్రెస్ పార్టీ డిమాండ్

### బిజెపి వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి శ్రేణులు

అనంతపురం,: జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా అధ్యక్షుడు వై.మధు సూధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓబీసీ సమీక్ష సమావేశం నిర్వహించా రు, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శౌంరి నాగరాజు, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్ కు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా, నగర అధ్యక్షులకు ప్రత్యేకంగా ఘనంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ అనంత పురం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షులుగా ఎన్నికైన నూతన అధ్య క్షులకు అభినందనలు తెలియజేస్తూ ఓబీసీ విభాగం బలోపేతం చేయడం పై కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా డిసిసి జిల్లా అధ్యక్షుడు వై.మధు సూధన్ ఆధ్వర్యంలో గుంతకల్లు బిజెపి పార్టీ నీ విడి మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు,ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరియు పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇతర కాంగ్రెస్ జాతీయ నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరును, లాఠీ చార్జ్‌ను ఖండిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలో భాగంగా ఏఐసీసీ, ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షుడు వై.మధు సూధన్ రెడ్డి, ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు శౌంరి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ ఇమామ్ వలి, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు దాదా గాంధీ, ఓబీసీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల బొజ్జప్ప, గిరిజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఈరన్న, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మల్లయ్య హాజర య్యారు. ఈ సందర్భంగా కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో, యువతకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నాయకుల అరెస్ట్‌లకు వ్యతిరేకంగా ఈ ఆందోళనలు చేపట్టినట్టు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమామ్ వలి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరీక్షా పత్రాల లీకేజీ మరియు దానికి సంబంధించిన పరిణామాలపై విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం, పోలీసులు వారి పై క్రూరంగా వ్యవహరిస్తారా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయల పై బిజెపి దాడి చేస్తే తిరిగి అదే స్థాయిలో దాడులు పాల్పడతామని ఇక నుండి అసలు తగ్గేదెలా అని కాంగ్రెస్ పార్టీ ద్వారా ఆయన హెచ్చరికలు జారీ చేశారు. జంతర్ మంతర్ ఢిల్లీలో జరిగిన 'ఛలో పార్లమెంట్' ఆందోళన సమయంలో పోలీసులు బలప్రయోగం చేయడం, లాఠీచార్జ్ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ అగ్రనేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని మీడియాతో కాంగ్రెస్ పార్టీ ద్వారా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆలం నవాజ్, బ్యాళ్ల శివ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్, గోపాల్, కేకేసి అబ్బాస్, చంద్ర, బెలుగుప్ప రమేష్, పోలక్క, నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహా రెడ్డి, ముజమ్మిల్,ఎస్.యం.భాష, ఇర్షాద్ బాబా, దాదు, చేతన్, చరణ్, సుధాకర్, కునుతురు షఫీ, రాయదుర్గం వసంత్ గౌడ్, మహబూబ్ భాష, రఫీ, తదితరుకు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిని కలిసిన జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి

తాడిపత్రి, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డితో కలిసి తాడిపత్రి నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతం



తదితర అంశాలపై చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే జిల్లాలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, పార్టీ వ్యూహాలు వంటి అంశాలపై కూడా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. సమావేశంలో రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# ప్రమాదవశాత్తు వృద్ధురాలు మృతి



తాడిపత్రి,: మండలం ఆలూరు గ్రామంలో గురువారం జరిగిన విషాద ఘటనలో లక్ష్మీదేవి (60) అనే వృద్ధురాలు ట్రాక్టర్ ఎక్కడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, ఆలూరు గ్రామానికి చెందిన చెన్నకేశవులు ట్రాక్టర్ నిర్వాహకుడు కాగా, ట్రాక్టర్ డ్రైవర్ ఆంజనేయులు తన ఇంటి వద్ద ట్రాక్టర్‌ను నిలిపి ఉంచేవాడు. ఇంటి సమీపంలోనే ట్రాక్టర్ కింద నీడ ఉండటంతో లక్ష్మీదేవి ప్రతిరోజూ అక్కడే విశ్రాంతి తీసుకునేది. శుక్రవారం కూడా ఆమె ట్రాక్టర్ కింద నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన రామనాథ్ రెడ్డి తన ట్రాక్టర్ బురదలో ఇరుక్కుపోవడంతో చెన్నకేశవులు ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లేందుకు అనుమతి కోరాడు. అనంతరం ట్రాక్టర్ కింద వృద్ధురాలు నిద్రిస్తున్న విషయాన్ని గమనించకుండా ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి ముందుకు కదిలించడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారులు ఆంజనేయులు, గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

# 27న ఇంటింటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### పత్తికొండ నియోజక వర్గ పరిశీలకులు వడ్డే సిమెంట్ పోలన్న

పత్తికొండ,:కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు, పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం బాబు నాయకత్వంలో, పత్తికొండ నియోజకవర్గ పరిశీలకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించ నున్న ఇంటింటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్య కర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని సూచించారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేసేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం బాబు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు.




# రూ.679.71 కోట్లతో ముదిగుబ్బ--కదిరి జాతీయ రహదారి (ఎన్ హెచ్-42) నాలుగు లేన్లుగా విస్తరణకు కేంద్రం ఆమోదం

### ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి చారిత్రాత్మక మైలురాయి.

### మోదీ విజన్.. గడ్కరీ అమలు.. ధర్మవరం అభివృద్ధికి రూ.680 కోట్ల మహా ప్రాజెక్టు

### 70 శాతం ధర్మవరం గుండా సాగే జాతీయ రహదారి ప్రాజెక్టు

### మంత్రి సత్యకుమార్ హర్షం

ధర్మవరం, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ నుంచి కదిరి వరకు ఉన్న జాతీయ రహదారి-42 (ఎన్ హెచ్ -42) ను ప్రస్తుతం ఉన్న 2 లేన్ల రహదారిని పేవ్డ్ షోల్డర్లతో కూడిన 4 లేన్ల జాతీయ రహదారిగా విస్తరించి బలోపేతం చేసేందుకు రూ.679.71 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తన అధికారిక సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలతో పాటు





కర్ణాటకలోని పలు ప్రాంతాలకు బెంగళూరు--విజయవాడ--కొలకతా (బి కే వి) ఎక్స్‌ప్రెస్‌వే, తిరుపతి, చెన్నై నగరాలతో మరింత వేగవంతమైన అను సంధానం ఏర్పడనుందన్నారు, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు సరుకు రవాణా వేగవంతమై, ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామికాభివృద్ధి, లాజిస్టిక్స్ రంగాలకు గణనీయమైన ఊతం లభించనుంది. ఈ ప్రాజెక్టులో 4 లేన్ల ప్రధాన రహదారి, సర్వీస్ రోడ్లు, ఒక ఫ్లైఓవర్, ఒక వాహన అండర్‌పాస్-కమ్-రోడ్ ఓవర్ బ్రిడ్జి (వి యూ పి - కమ్ - ఆర్ ఓ బి), ఒక ప్రధాన వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. దీంతో ప్రయాణికులు, వాణిజ్య వాహనాలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటు లోకి రానుంది, ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రి ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... సుమారు రూ.680 కోట్లతో మంజూరైన ఈ ప్రతిష్మాత్మక రహదారి ప్రాజెక్టులో 70 శాతానికి పైగా భాగం ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం గుండా వెళ్లడం ఎంతో సంతోషకరమైన విషయం అని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా ధర్మవరం నియోజకవర్గం లో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడటంతో పాటు, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి, కొత్త పెట్టుబడులు ఆకర్షితమై, ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి జాతీయ రహదారుల నిర్మాణం, మౌలిక సదుపాయాల విస్తరణ వేగంగా కొనసాగుతోందని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. చివరగా, ధర్మవరం ప్రజల తరఫున మరియు నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును మంజూరు చేసిన కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, దేశ అభివృద్ధికి అంకితభావం తో పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దాం

**ఈనెల 27 నుంచి కూటమి ప్రభుత్వం నిర్వహించే 45 రోజుల పాటు అభివృద్ధి సంక్షేమం, రెండేళ్ల పాలన నమ్మకం పై ఇంటింటా ప్రచార కార్యక్రమం విజయ వంతం చేద్దాం**

**ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**2,202.07 కోట్లకు పైగా నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం**

**రూ.15,803 కోట్ల పెట్టుబడులతో పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ యూనిట్,**

**మరో రూ.51వేల కోట్లతో అమడగూరులో అతిపెద్ద రిలయన్స్ సోలార్ భారీ ప్రాజెక్ట్,**

**రాష్ట్రంలోనే రూ.69305.07 కోట్లతో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి గేమ్ చెంజర్ గా మారడం ఖాయం**

పుట్టపర్తి,:అభివృద్ధి, ప్రజా సంక్షేమ మే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపు నిచ్చారు.పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య నేతలు, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీ నుంచి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ఇంటింట ప్రచారం కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నియోజకవర్గంలో"అభివృద్ధి -- సంక్షేమం, రెండేళ్ల పాలనపై నమ్మకం" ఇంటింటా ప్రచార కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు భాగస్వామి కావాలని కోరారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి కొండంత బలమని, పార్టీ బలోపేతానికి వారి సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు.ఈ రెండేళ్ల కూటమి పాలనలో పుట్టపర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి పనులు ప్రారంభ మయ్యాయని తెలిపారు. రూ.6,9305.07 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే రూ.15803 కోట్ల పెట్టుబడితో పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ యూనిట్, రూ.51 వేల కోట్లతో అమడగూరులో రిలయన్స్ సోలార్ మెగా ప్రాజెక్టు వంటి భారీ పెట్టుబడులు నియోజ కవర్గ భవిష్యత్తును మార్చనున్నాయని వివరించారు. వీటి ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడం తో పాటు రాష్ట్రంలోనే అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.69305.07 కోట్లతో గేమ్‌చేంజర్‌గా నిలు స్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి ఏటా చదువుకునే విద్యార్థుల తల్లి ఖాతాలో 15వేలు , దీపం పథకం 2 ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం ,శ్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం,చేనేతలకు 2 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా 20,000 వారి ఖాతాలో జమ, రాష్ట్రంలో 269 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి ఐదు రూపాయలకే పేదలకు కడుపునిండా భోజనం, పేదలకు త్వరలో మరో 5 లక్షల పక్కా గృహాలు మంజూరు, మత్స్య కారుల సేవలో ప్రతి ఏటా వారికి 20,వేలు, ఆటో డ్రైవర్లు సేవలో రూ 15వేలు జమ, రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, 175 నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తు న్నారని తెలిపారు. రాష్ట్రంలో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో అన్ని నియోజకవర్గాల్లో సమగ్ర అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ ప్రభుత్వం ముందుకెళ్తోందని పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు అధిక కేటాయింపులు తోపాటు 30 వేల కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు అంతే కాకుండా రైతాంగానికి చేయూతనిచ్చేలా 90% సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు వ్యవసాయ యంత్రాలు అంద జేస్తోందని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా పదివేల కోట్లకు పైగా సుమారు 67 లక్షల మందికి పిల్లల భవిష్యత్తుకు చంద్రబాబు భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ లో సాగుతున్న కూటమి ప్రభుత్వమనీ కొని యాడారు. ఈ కూటమి ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి గ్రామాల అభివృద్ధి తో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తగిన తోడ్పాటు ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు కోరారు. అంతేకాకుండాఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని అత్యంత విజయ వంతంగా నిర్వహించిన నియోజకవర్గ టీడీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించాలని, సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి కన్వీనర్లు బోయ రామాంజనేయులు విజయ్ కుమార్, మళ్ళీ ,మైలే శంకర్, శెట్టి వారి జయచంద్ర ,గోపాల్ రెడ్డి, రామకృష్ణ, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపీ శ్రీనివాసులు, పట్టణ ఉపాధి కల్పన మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కాలే నాయక్ , కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ యశోద రాయుడు, డైరెక్టర్ నారపరెడ్డి, యువ నాయకులు రామారావు, లక్ష్మీపతి , గంగాధర్ నాయుడు, రాష్ట్ర టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ ఎల్ఐసి నర్సింహులు, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు మాజీ జడ్పిటిసిలు శ్రీనివాస్ రెడ్డి ,పిట్ట ఓబుల్ రెడ్డి, ఓబులేసు, గంగాధర్, నాగరాజు, రమణారెడ్డి, బోయ శివారెడ్డి తుమ్మల మహబూబ్ బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు ,పలువురు టీడీపీ మహిళా కార్యకర్తలు భాగ్య, మాధవి ,లావణ్య రాధా, సుభాషిని , రమణమ్మ ,చెన్నకృష్ణమ్మ ,పద్మావతి ,పలువురు మహిళలు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# రైతులు పంటలకు భీమా చేయించుకోండి

**ధర్మవరం ఏ. డి. లక్ష్మి నాయక్**



చెన్నేకొత్తపల్లి, : ధర్మవరం డివిజన్ పరిధిలోని మండలాలలో వుంటున్న రైతులు తమ పంటలకు భీమా చేయించుకోవాలని ధర్మవరం డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మి నాయక్ అన్నారు. గురువారం చెన్నేకొత్తపల్లి మండలంలోనీ ప్యాదిండి గ్రామంలో రైతు వేరుశనగ పొలాలను సందర్శించడం జరిగింది.వేరుశనగ పొలాల్లో ఎరువులు అలాగే పురుగుమందులు వాడకాన్ని గురించి రైతులకు వివరించడం జరిగింది. రైతులందరూ



తప్పనిసరిగా తమ పంటలకు భీమా చేయించుకోవాలని సూచించారు.అదేవిధంగా ఎన్.ఎస్ గేట్ ఏ.పీ.జీ.బీ. బ్యాంకు ను సందర్శించి మేనేజర్ తో క్రాప్ ఇన్సూరెన్స్ కి నమోదు చేసుకున్న రైతుల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. తదుపరి ఆయన చెన్నేకొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలంలోని ఎరువులు, పురుగుమందుల డీలర్లందరికీ సమా వేశాన్ని నిర్వహించి రైతులకు ఎం ఆర్ పి ధరలకే ఎరువులను, పురుగుమందులను, విత్తనాలను విక్రయించాలని అనుమతి ఉన్న నాణ్యమైన పురుగుమందులు, విత్తనాలు ఎరువులు మాత్రమే అమ్మాలని, అన్ని ఎరువుల దుకాణాలలోనూ ధరల పట్టికను కచ్చితంగా ప్రదర్శించవలెనని యూరియా, డిఏపి విక్రయాలన బిజ?న్ని కచ్చితంగా ఏపీఎయిమ్స్ ఐ.ఎఫ్.యం.యస్ లో నమోదు చేయవలెనని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి ఉంచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ,వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి డీలర్లందరూ పాల్గొన్నారు.

# మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నూర్ మహమ్మద్ ని పరామర్శించిన మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ



గోరంట్ల, :గోరంట్ల మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, సీనియర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు నూర్ మహమ్మద్ ఆరోగ్యరీత్యా పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నందు ప్రథమ చికిత్సలు చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసు కుంటుండగా గోరంట్ల పట్టణంలో నూర్ మహమ్మద్ స్వగృహం వద్దకు వెళ్లి, పరామర్శించి ఆరోగ్యరీత్యా తీసు కోవలసిన జాగ్రత్తలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ పరామర్శించారు, అలాగే గోరంట్ల మాజీ టౌన్ కన్వీనర్ ధనారెడ్డి,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రావు, శివానంద,రంగారెడ్డి,వెంకట రంగా రెడ్డి,విజయ సింహా రెడ్డి, హైదర్ వలి, సమర సింహా రెడ్డి,రాజారెడ్టి, ప్రభాకర్ రెడ్డి, వెంకట శివారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

గోరంట్ల, :గోరంట్ల మండలం లోని గుంటిపల్లి తండాలో కాపురం ఉంటున్న ఇంటర్ విద్యార్థిని అదృశ్యం కావడంతో తండ్రి రవి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు,విద్యార్థిని పట్టణం లోని ఒక కళాశాలలో ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు.

# వాతావరణ బీమాకు నేడే చివరి రోజు

**వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్**

తాడిమర్రి,: వాతావరణ బీమా పథకం కింద వేరుశనగ పత్తి దానిమ్మ టమోటా చీని పంటలకు బీమా చేయించుకోవాలనుకున్నవారు జూలై నెల 24 వ తారీకు అనగా ఈరోజు చివరి తేదీ కావున రైతులు వెంటనే సంబంధిత భీమా మొత్తాన్ని చెల్లించి భీమా చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ తెలిపారు, అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఫసల్ బీమా పథకం కింద వరి మొక్కజొన్న కంది ఆముదము రాగి వంటి పంటలకు భీమా చేసు కోవాలని తెలియ జేశారు, ఇందులో ముఖ్యంగా గమనించదగి నటువంటి విషయము వారికి ఆగస్టు 15 వరకు భీమా చేసుకోవడానికి గడువు ఉన్నది వరి తప్ప మిగిలిన మొక్కజొన్న, కంది,ఆముదము, రాగి, వంటి పంటలకు జూలై 31 వ తారీకు వరకు చివరి తేదీ ఉన్నది కావున రైతు సోదరులు మీ యొక్క తోటి రైతు సోదరులకు బంధుమిత్రులకు గ్రామంలో తెలియనటు వంటి వాళ్లందరికీ కూడా తెలియజేసి బీమా చేయించుకోవాలని తెలియ జేశారు , ఇందులో ఎటువంటి ఇబ్బందులు కలిగిన మీరు ఆయా గ్రామాల వారు



సంబంధిత రైతుసేవ కేంద్రానికి సంప్రదించి రైతు సేవా కేంద్రం అధికారి ద్వారా మీ యొక్క సందేహాలు ఏమైనా ఉండట్లయితే అడిగి నివృత్తి చేసుకొని మా రైతు సేవ కేంద్రం అధికారుల ద్వారా బీమా మొత్తాన్ని చెల్లించు కున్నటువంటి వెసులుబాటు చేసుకోవలసినదిగా రైతు సేవ కేంద్రం అధికారులు మీరు ఎక్కడ చేసుకోవాలి ఎక్కడ భీమా మొత్తాన్ని జమ చేయాలి అనేటువంటి విషయాల్ని తెలియచేస్తారు కామన్ సర్వీసెస్ మీసేవ సెంటర్ దగ్గర కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా ఈ భీమా మొత్తాన్ని మీరు చెల్లించుకోగలరన్నారు.

## విశ్వనాథ్ అండ్ సన్స్ స్టైలిష్ పోస్టర్లు వైరల్!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలోని రెండో పాటను ఈ సాయంత్రం విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.






## 'టాక్సిక్' పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక చిత్రం



కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు.

## నాకు కొన్ని విలువలు ఉన్నాయి

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

## "మౌనం కాదు.. గళం విప్పాలి"



దేశంలో జరుగుతున్న సామాజిక, ప్రజా సమస్యలపై ప్రతి పౌరుడు బాధ్యతగా స్పందించాలని ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. మనకెందుకులే అనే నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రతి ఒక్కరూ తమ స్వరం వినిపించాలని ఆమె కోరారు. తాజాగా రాజ్యాంగ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్కు మద్దతుగా మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో దేశంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ, దేశంలో కీలకమైన సమస్యలు ఎదురవుతున్నప్పుడు చాలామంది వాటిని తమకు సంబంధం లేని విషయాలుగా భావించి మౌనం పాటిస్తున్నారని అన్నారు. కానీ అలాంటి వైఖరి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనాల్సిన అవసరం లేకపోయినా, కనీసం సమస్యలపై మాట్లాడటం, చర్చించడం, సోషల్ మీడియా ద్వారా స్పందించడం కూడా ఒక బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి న్యాయం జరగాలని తాను కోరుకుంటున్నానని మంచు లక్ష్మి తెలిపారు. ఆయన ఆశయాలను తాను గౌరవిస్తున్నానని, సమాజ ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తులకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే రాజకీయాలపై విమర్శలు చేయడం కంటే, దేశ భవిష్యత్తు, రాబోయే తరాల సంక్షేమం కోసం బాధ్యతతో స్పందించడం ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తూ నిశ్శబ్దంగా ఉండటం తనను బాధిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## 'ప్రళయ్'లో కళ్యాణి ప్రియదర్శన్ !

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందుతున్న ఈ సినిమా గురించి వస్తున్న తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.



Edited, Printed And Published Owned By K. Naresh Kumar, Flat No: 309/2, Krishna Plaza, Khairatabad, Hyderabad-50004. TELANGANA STATE, Website: www. prajamudra.Com, Email:mudranewstelugu@gmail.com, cell: 9573800809